ఫారం భూముల ఆక్రమణ

- స్తంభాలు కూల్చి, కంచెను పెకిలించి దున్నేస్తున్న రైతులు
- పట్టించుకోని పర్యవేక్షణ అధికారులు
- పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్న వైనం

జూపాడుబంగ్లా: తంగడంచ ఫారం భూములు ఆక్రమణకు గురవుతున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫారం అధికారుల భవనాలకు సమీపంలోనే సరిహద్దును చెరిపేసి భూములను దున్నేస్తున్నా పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

స్తంభాలను పెకిలించి..: ప్రస్తుతం తెంగడంచ పరిసరాల్లో ఎకరా రూ.10 లక్షల కు పైబడి ధర పలుకుతుంది. ఈనేపథ్యంలో సెంటు, రెండుసెంట్ల భూమి కలిసొచ్చినా మంచి పొలం విస్తీ ర్ణం పెర గటంతో పాటు ధర కలిసొస్తుంది. దీంతో పలువురు ఆక్రమణలకు తెరలేపారు. ఫారం అధికారుల భ వనాల సమీపంలో ఫారం భూముల కంచె వెంట ఉన్న దాదాపు 30 సరిహద్దు స్తంభాలను పెకిలించి ధ్వంసం చేశారు. ఫారం భూములను దున్నేసి తమ పొలంలో క లుపుకున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు కేవలం పోలీసులకు ఫిర్యాదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.



ఫారం భూముల సరిహద్దు కంచెను పెకలించి ధ్వంసం చేసిన స్తంభాలు,



భూమిని దున్నేసిన దృశ్యం

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం

ఫారం భూములు ఆక్రమణకు గురైన సంగతి తెలుసుకొని, స్తంభాలను ధ్వంసం చేసి కంచెను పెకలించేసిన రైతు గోపిపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. అయినా ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య పట్టించుకోకపోవటంతో కలెక్టర్ స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశాం.

– దేవభూషణం, ఏఓ

స్తంభాలు ధ్వంసం చేయలేదు

స్తంభాలను నేను ధ్వంసం చేసి, కంచెను తొలగించలేదు. పదేళ్ల క్రితం ఎత్తిపోతల పథకం పైపులైన్ నిర్మించే సమయంలో కాంట్రాక్టర్లు ధ్వంసం చేశారు. దాన్ని ఇప్పుడు నేను ధ్వంసంచేసినట్లు అధికారులు పేర్కొనటం సమంజసం కాదు.

– గోపి, రైతు

క్లుప్తంగా

రంజాన్ పండుగకు ఏర్పాట్లు



ఈద్గాల వద్ద ప్రార్థన స్థలాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేస్తునట్లు మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆయా ఈద్గాలను మున్సిపల్ చైర్మన్, కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ రంజాన్ పండుగ రోజు ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసుకోవడానికి స్థలాలను పరిశుభ్రంగా ఉంచుతామన్నారు. ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో 30రోజుల పాటు ఉపవాసం ఉండి పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు అత్యధిక సంఖ్యలో ఈద్గాల వద్దకు చేరుకుంటారని చెప్పారు. భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు చేసే ముస్లిం సోదరులకు మంచి వాతావరణం కల్పిస్తామని పేర్కొన్నారు. కౌన్సిలర్లు హమీద్, చాంద్‌బాషా, అశోక్, మాజీ కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి జాబుకార్డు

కొత్తపల్లి: మండలంలో అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి జాబుకార్డు కల్పిస్తామని ఏపీఓ రాజునాయక్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా డుతూ మండలంలో జాబుకార్డులేని వారు అర్హకలిగి ఉంటే కొత్తజాబుకార్డు ఇచ్చి పనికల్పిస్తామని చెప్పారు. అలా ఎవరైన ఉంటే సంబధిత ఫీల్డ్‌అసిస్టెంట్లు వివరాలు సేకరించాలని సూచించారు. అదేవిధంగా బ్యాంకు పాస్‌బుక్కుకు ఆధార్‌కార్డు అనుసందానం లేనివారు ఆధార్ కార్డును బ్యాంకు పాస్‌బుక్కుకు అనుసంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈసీ శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ఉపాధి కూలీలకు క్షయ, వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ప్రజలందరూ క్షయవ్యాధి, వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ సూచించారు. మండలంలోని కొక్కెరంచ గ్రామ సచివాలయ పరిధిలోని మజరా నాగంపల్లి గ్రామ శివారుల్లో ఉపాధి హామీ కూలీలకు క్షయవ్యాధి, వడదెబ్బపై గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, వ్యాధిని గుర్తించే పరీక్షలు, వ్యాధి నిర్ధారణ అనంతరం చికిత్స కాలం గురించి వివరించారు. పొగాకు, సిగరెట్టు, మద్యపానం వంటి వ్యసనాలు ఉన్నవారికి క్షయవ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. పౌష్టికాహారం తీసుకుంటే క్షయవ్యాధిని నివారించవచ్చన్నారు. అదేవిధంగా వడదెబ్బ తగల కుండ నీరు,పళ్ళ రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ ద్రవపదార్థాలు తరచూ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి, హెల్త్ అసిస్టెంట్ రాజగోపాల్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే సమాచారం ఇవ్వాలి



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆత్మకూరు: అగ్నిప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వాలని అగ్నిమాపక కేంద్ర అధికారి భీముడునాయక్ సూచించారు. పట్టణంలోని గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్ ,రఘునాథ్ సెంటర్లలో అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక విన్యాసాలను ప్రదర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన వెంటనే ప్రజలు సమాచారం అందిస్తే మంటలు వ్యాపించకుండా నివారించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం అగ్నిప్రమాద నివారణకరపత్రాలను అందజేశారు.

మేడే విజయవంతం చేయండి

ఆత్మకూరు: ప్రజా అనుకూల విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతి వాడలో కార్మికులు మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని సీఐటియూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కార్యదర్శి రామ్‌నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ధనుంయమీటింగ్‌హాల్‌లో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రణధీర్, భాస్కర్, శివ, రాముడు, నాగరాజు, పార్వతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బయలువీరభద్ర స్వామికి పూజలు



క్షేత్రపాలకుడుబయలువీరభద్రస్వామి కి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రపాలకుడిగా ప్రసిద్ధిగాంచిన శ్రీబయలువీరభద్ర స్వామి వారికి అమావాస్య సందర్భంగా బుధవారం శాస్త్రోక్తంగా అర్చకులు పరోక్షసేవ నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో వీరభద్రునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు చేశారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం క్షేత్రపాలకుడికి ప్రత్యేక నైవేద్యం సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

అక్రమ మద్యం విక్రేతల అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పగిద్యాల: తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయిస్తున్న మద్యం విక్రేతలను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తూర్పు ప్రాతకోట గ్రామానికి చెందిన కుమ్మరి కురుమన్న, కుమ్మరి శ్రీనివాసులు, పడమర ప్రాతకోటకు చెందిన రంగం రాఘవేంద్ర, గంగి నరేంద్ర, తదితరులు తెలంగాణ నుంచి మద్యం తెచ్చి అక్రమంగా గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ఈ మేరకు వారిపై నిఘా ఉంచి దాడులు నిర్వహించగా మద్యం తరలిస్తుండగా ఎన్.ఘణపురం వద్ద కృష్ణానది మునకపొలాల్లో వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి 4బైక్‌లు, ఓల్డ్ అడ్మిరియల్ 180ఎం.ఎల్ బాటిళ్లు 187, 180ఎం.ఎల్ ఇంపీరియల్ బ్లూ సీసాలు 15 స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో సాగు చేసిన మొక్కజొన్న, పసుపు పంటలకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆత్మకూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ నవీన్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 28 మండలాల్లో 47,761.66 ఎకరాల్లో మొక్కజొన్న, పసుపు పంటలను రైతులు ఈ–క్రాప్ చేసుకున్నారని చెప్పారు. ఈ పంటలను ఇంకా నమోదు చేసుకోని రైతులు ఈ నెల 21 నుంచి రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.మొక్కజొన్న క్వింటారూ.1,962, పసుపు రూ.6,850 చొప్పున ప్రభుత్వం ధాన్యాన్ని కొ నుగోలు చేస్తుందని చెప్పారు. రైతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి సమ్మెటివ్-2 పరీక్షలు

పగిద్యాల: జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు మండలం వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలల్లో గురువారం నుంచి సమ్మెటివ్-2 పరీక్షలు ప్రారంభం అవుతాయని ఎంఈఓ సుభాన్ బుధవారం తెలిపారు. 1 నుంచి 9వరకు చదివే విద్యార్థులకు సమ్మెటివ్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 1-8 తరగతుల విద్యార్థులకు ఉదయం 8 నుంచి 11.15 గంటల వరకు ఉంటుందన్నారు.

కొలతల ప్రకారంగా పనులు చేయాలి

జూపాడుబంగ్లా: నిర్ణీత కొలతల ప్రకారంగా పనులు చేసి గరిష్టస్థాయి కూలిని పొందాలని ఎంపీడీఓ మంజులవాణి ఉపాధికూలీలకు సూచించారు. బుధవారం ఆమె మండలంలోని తంగడంచ గ్రామ చెరువులో జరుగుతున్న అమృత్‌సరోవర్ కార్యక్రమ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ ఉపాధికూలీలతో మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఉదయం 6 గంటల్లోగా పనుల్లోకి వచ్చి 10గంటల్లోగా ముగించుకొని ఇళ్లకు వెళ్లాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

నందికొట్కూరు: ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 16, 17వ వార్డుల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం కౌన్సిలర్లతో కలిసి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవూఫ్, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంను చేసుకుందాం

కొత్తపల్లి: జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామని కో–ఆప్షన్ సభ్యుడు షేక్ మహమ్మద్ గౌస్ పిలుపునిచ్చారు.బుధవారం శివపురం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో 4వ వార్డు మెంబర్ బైలాన్‌బాషా, మాజీ సర్పంచులు శ్రీను, కృష్ణ, మహెబూబ్ బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలే జగనన్నను గెలిపిస్తాయి

ఆత్మకూరు: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు మళ్లీ ఆయనను సీఎంగా గెలిపిస్తారని ఎస్ఎస్‌తండా సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్ నాయక్ అన్నారు. మండలంలోని నాగలూటి చెంచుగూడెంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన్న, రమేష్, మహేంద్ర, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నినాదం .. మా నమ్మకం నువ్వే జగన్

మిడుతూరు: ప్రజలంతా జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ అధ్యక్షుడు నాగతులసిరెడ్డి, గ్రామ సర్పంచ్ ఉషారాణి అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలో జగనన్నే మన భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నబీరసూల్, వైస్ సర్పంచ్ యశోధమ్మ, రాంభూపాల్‌రెడ్డి, ఎల్లారెడ్డి, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జగనన్నకు ఛాన్స్ ఇవ్వండి

జూపాడుబంగ్లా: వచ్చే ఎన్నికల్లో మరోసారి జగన్ మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని మండల ఉపాధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి కోరారు. మండలంలోని మండ్లెం గ్రామంలో బుధవారం × జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్‌ె కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు ఆనంద్ రజక, కుమ్మరి హుసేనయ్య, గొల్లచిన్నమద్దిలేటి పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మిడుతూరులో కొనసాగిన 'గడప గడపకు మన ప్రభుత్వం'



వృద్ధుడికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ప్రజారంజక పాలనను అందిస్తున్న సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ పిలుపునిచ్చారు. బుధవారం మిడుతూరు గ్రామ సచివాలయం -2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, జగనన్నే మన భవిష్యత్తు, నా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రస్తుత జగనన్న ప్రభుత్వానికి గత చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న వ్యాత్యాసాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం అమలౌతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా మరోసారి జగనన్నకు సీఎంగా అవకాశం ఇవ్వాలన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టండి

వేసవితీవ్రత అధికంగా ఉన్నందున గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సచివాలయ పరిధిలో ప్రజలు అడిగిన సమస్యలకు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మండలస్థాయి అధికారులను ఆదేశించారు. కడుమూరు గ్రామానికి చెందిన మైనార్టీ కాలనీ మహిళలు మిడుతూరుకు చేరుకొని మైనార్టీ కాలనీలో నీటి సమస్య తీవ్రంగా ఉందని పరిష్కరించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. నీటిసమస్యను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, ఏడీఏ విజయశేఖర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, నాయకులు కమతం వీరారెడ్డి, సీతారాముడు, రమేష్, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ఇనాయతుల్లా తదితరులు పాల్గొన్నారు.

‘బీజేపీని గద్దె దించేంత వరకు పోరాటం’

ఆత్మకూరు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేంత వరకూ పోరాటాలు చేస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయకులు అన్నారు. పట్టణంలోని సంగమేశ్వరం సర్కిల్ వద్ద బుధవారం రెండవ రోజు ప్రచార భేరీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద నాయకుడు నరేంద్రమోదీని, ఆయన ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతకుమునుపు పట్టణంలోని వీరభద్ర ఏరియా, వెంగళరెడ్డి నగర్, పద్మావతి స్కూల్, అర్బన్‌కాలనీ, తోటగేరి, గాంధీ బొమ్మ వరకు ప్రచార యాత్ర నిర్వహించారు. కార్యక్రమం ఆయా పార్టీల నాయకులు రామ్‌నాయక్, స్వాములు, శ్రీనివాసులు , సద్దాం హుస్సేన్ పాల్గొన్నారు.

పగిద్యాలలో ప్రచారభేరీ

పగిద్యాల: రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించాలని సీపీఐ పార్టీ చేపట్టిన ప్రచారభేరీ కార్యక్రమాన్ని బుధవారం ఆపార్టీ నాయకులు బుధవారం పగిద్యాలలో నిర్వహించారు. మండల కార్యదర్శులు అబ్దుల్‌మజీద్, ఇస్మాయిల్, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: పట్టణంలోఎగ్జిబిషన్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కమిషనర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వేసవిలో పాఠశాలలు సెలవు కావడంతో పిల్లలు, పట్టణప్రజలు ఆహ్లాదం కోసం ఈ ఎగ్జిబిషన్‌లు ఎంతగానో ఉపయోగపడుతందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్‌సభ్యులు రషీద్, కౌన్సిలర్లు విజయచౌదరి, విజయ్, రాముడు, హరి, రెహమాన్, కలిముల్లా తదితరులు పాల్గొన్నారు.

కొండచెంచుల సమస్యల పరిష్కారానికి కృషి



గిరిజనుల ఉత్పత్తులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి

వెలుగోడు: కొండ చెంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్ పర్సన్ బడిగించల విజయలక్ష్మి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆమె వెలుగోడు మండల కేంద్రంలోని చెంచు కాలనీని సందర్శించారు. కొండ చెంచులు తయారు చేసిన వస్తువులను ఆమె పరిశీలిస్తూ వారితో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొండ చెంచులు ఎంతో అద్భుతంగా తయారు చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా కొండ చెంచు హస్తకళాకారులు తమ సమస్యలను చైర్ పర్సన్ దృష్టికి తెచ్చారు. డీసీహెచ్ నుంచి గుర్తింపు కార్డులు ఇప్పించాలని, తమ ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా ఉన్న లేపాక్షి ఎంపోరియంల ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. దాదాపు 500 మంది కళాకారులు ఉన్నామని తమకు సీడీసీ, సీఎఫ్‌సీ సెంటర్‌లు ఏర్పాటు చేయించాలన్నారు. ఇందుకు చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, ఏపీహెచ్‌డీసీ కర్నూలు మేనేజర్ తిమ్మయ్య, సిబ్బంది కిషోర్, వైస్ ఎంపీపీ కొడావత్ శంకర్ నాయక్ , చెంచు సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి కొమ్మి హుసేనమ్మ, తోగట వీర క్షత్రియ సంక్షేమ సంఘం కార్యదర్శి నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్

మహానంది: గ్రామాల్లో ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించినా కఠినచర్యలు తప్పవని మహానంది ఎస్ఐ జి.నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానంది ఎస్ఐగా ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్ఐ సీసీ నాగార్జునరెడ్డి వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో మద్దికెర నుంచి నాగేంద్రప్రసాద్‌ను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన ముందుగా శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నంద్యాల(వ్యవసాయం): మే 4వ తేదీన పౌర్ణమి పురస్కరించుకుని నంద్యాల డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ రావు, అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటినాయుడు బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ మే 4న ఉదయం సూపర్ డీలక్స్ బస్సు ఏర్పాటు చేశామన్నారు. అరుణాచలంలో గిరి ప్రదక్షణ చేసే భక్తులకు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. నంద్యాల నుంచి అరుణాచలం రాను పోను చార్జీ రూ.1,730 చెల్లించాలన్నారు. అలాగే కాణిపాకం, గోల్డెన్ టెంపుల్, ఇతర దేవస్థానాలను సమయాన్ని బట్టి దర్శనం చేయించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. బస్సు 4న ఉదయం బయలుదేరి 6వ తేదీ ఉదయం నంద్యాలకు వస్తుందని, అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల కోసమే ఆర్‌ఓ ప్లాంట్

నంద్యాల(అర్బన్): మార్కెట్ యార్డుకు పంట దిగుబడులు తెస్తున్న రైతులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేశామని మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి తెలిపారు. యార్డులో రూ.3లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును బుధవారం యార్డు కార్యదర్శి కల్పన, అసిస్టెంట్ కార్యదర్శి శేషిరెడ్డితో కలిసి ప్రారంభించారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక



జంబులయ్య మధు వ్యాసు దినేష్ రవికుమార్ చిన్నురుకుంద నాగన్న

- 16 మందిలో ఏడుగురు పాములపాడు మండలం వారే

పాములపాడు: రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పాములపాడు మండలానికి చెందిన ఏడుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని సీనియర్‌హాకీ క్రీడాకారుడు జంబులయ్య తెలిపారు. ఈ నెల 16న నంద్యాల్య జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా సీనియర్ హాకీ మెన్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచి పాములపాడు మండలానికి చెందిన జంబులయ్య, మధు, వ్యాసు, దినేష్, రవికుమార్, చిన్న ఉరుకుంద, నాగన్న ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ధర్మవరం లో రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. ఉమ్మడి జిల్లా నుంచి 16 మంది క్రీడాకారులు ఎంపికయ్యారని, అందులో ఏడుగురు ములపాడు మండలానికి చెందినవారే ఉన్నారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను పలువురు అభినందించారు.

బుక్కాపురం గ్రామానికి నేడు ఎమ్మెల్యే శిల్పా రాక

మహానంది: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి గురువారం బుక్కాపురం గ్రామానికి రానున్నారని పార్టీ మండల కన్వీనర్ కొమ్మా మహేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, ఆమె కుమారుడు కుంచపు శ్రీనివాసులు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు చీరల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా కార్యక్రమంలో పాల్గొని చీరలను పంపిణీ చేస్తారని చెప్పారు.

బెల్లం ఊట ధ్వంసం

నందికొట్కూరు: పట్టణంలోని షికారిపేటలో పోలీసులు, సెబ్ పోలీసులు బుధవారం 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ ఎన్వీ రమణ, సెబ్ ఎస్ఐ గిరి తెలిపారు. నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించగా సారా ఊటను ధ్వంసం చేయగా తయారు చేసే వారు పరారయ్యారని చెప్పారు.

కొత్తపల్లిలో ఇఫ్తార్‌విందు

కొత్తపల్లి: మండల కేంద్రమైన కొత్తపల్లిలో బుధవారం మస్జీద్ ఆవరణలో ముస్లిం పెద్దలు మమ్మద్‌హనీఫ్, ఇస్మాయిల్, వహిద్, వలి, బాబు మియా, రాజ్‌కమాల్, మొల్ల ముర్తుజా, ఖాజమియాల ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుధాకర్ రెడ్డి, కొత్తపల్లి వైస్‌ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ముస్లిం మత బోధకుడు ఇమామ్ ఖాజా, వైఎస్సార్‌సీపీ నాయకులు రామిరెడ్డి, రవీంద్రారెడ్డి, చింతమాను శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ సర్వే తప్పకుండా చేయాలి

కొత్తపల్లి: మండలంలో ఏవరేవరు ఏం చదివారు, ఏం చదువుతున్నారు, చదువుతున్నారా లేదా అన్న విషయాలపై సచివాలయ సిబ్బంది ఎడ్యుకేషన్ సర్వే తప్పకుండా చేయాలని ఎంపీడీఓ మేరి సూచించారు. బుధవారం కొత్తపలి, నందికుంట సచివాలయాలను సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ 6 నుంచి 18 సంవత్సరాలలోపు పిల్లలు, 18 నుంచి 23 సంవత్సరాలలోపు యువతీ, యువకులు ఏం చదువుకున్నారు, ఎక్కడ చదువుతున్నారు, ప్రస్తుతం చదువుతున్నారాలేదా అన్న విషయాలను ఈ సర్వేలో పొందుపరచాల్సి అవసరం ఉందన్నారు.